ధర్మరాజు

నోరి నరసింహశాస్త్రి బి. ఏ., సాహితీసమితి సభ్యుడు

౧

"బుల్లీ, మీ పెద్దనాన్న వచ్చారు, రా!" అనే పినతల్లి మాటలు వినగానే పెరటిలో గోలగా అరుస్తున్న మాలకాకులవంక చూస్తూ కూర్చున్న బుల్లి వాకిట్లోకి పరిగెత్తుకొని వచ్చింది.

తాండవకృష్ణయ్య అంతకుముందే రైలు దిగి వచ్చినాడు. వాకిట్లో ఆయనను చూడగానే నాగరత్తమ్మ కాళ్లకు నీళ్లిచ్చి "అంతా కులాసాగా ఉన్నారా?" అని అడిగింది. కృష్ణయ్య కాళ్లు కడుక్కుంటూ "ఆ, అంతా బాగానే ఉన్నారు" అన్నాడు.

ఇంతలో బండివాడు వాకిట్లో 'సామీ' అని కేకలు పెట్టుతున్నాడు. కృష్ణయ్య "పోవోయి, ఒప్పుకున్న ప్రకారము ఇచ్చినానుగా, పో" అని అన్నారు.

"ఏం సామీ రొంబా కష్టముంది. ముక్కాలు రూపాయి ఏం సరిపోతుంది? కడుపు నిండదు సామీ" అని బండివాడు గోల చేయసాగినాడు. ఆ మాటలు విని నాగరత్తమ్మ "ఇక్కడినుంచి బ్రాడ్వేకు ఆరణాలే ఎప్పుడూ తీసుకుంటారు కాని సెంట్రలు స్టేషనునుంచి ముక్కాలు రూపాయి కాదా చాలదేం?" అన్నది.

అక్కడి రివాజు తెలిసిన తర్వాత తాండవకృష్ణయ్య బండివాణ్ణి గదమాయించినాడు. ఇక లాభం లేదనుకొని "మంచిదానవే అమ్మా!" అని వాళ్లను అరవతెలుగులో తిట్టుకుంటూ బండివాడు వెళ్లిపోయినాడు.

తాండవకృష్ణయ్య నొచ్చుకున్నాడు.

"ఈ దరిద్రగొట్టువాళ్లు ఎప్పుడూ అంతే లెండి! అసలు ఇక్కడికి అర్ధరూపాయి ఇస్తేనే ఎక్కువ! మీ తమ్ముడుగారు మీకు కనిపించలేదా? మీకోసమే రైలుదగ్గరికి వెళ్ళినారే?" అన్నది నాగరత్తమ్మ.

"అట్లాగా, నేను రైలు దిగగానే తమ్ముడుగారు వస్తారేమో నని ఇటూ అటూ చూసి కనపడకపోతే బండి చేసుకొని వచ్చివేసినాను" ఇట్లా అని తాండవకృష్ణయ్య అక్కడ ఒక బల్లమీద కూచున్నాడు. అప్పుడు నాగరత్తమ్మ బుల్లిని కేక వేసింది. బుల్లి వాకిట్లోకి వచ్చి ఎవరో కొత్తమనిషినిచూసి బెదురు చూపులు చూస్తూ సిగ్గుతో పోయి పినతల్లిని "అప్పా!" అంటూ గట్టిగా కౌగిలించుకున్నది.

నాగరత్తమ్మ బుల్లి పట్టు కొంత సడలించుకొని దాని ముఖము తాండవకృష్ణయ్య వైపుకు

తిప్పి, "అటువైపు చూడు, చిలకల బాబును మరిచిపోయినావా?" అన్నది.

బుల్లి, తాండవకృష్ణయ్యవైపు చూస్తున్నది. ఇంతలో ఆయన జేబులోనుంచి రెండు పంచదారచిలకలుతీసి చూపి "దా, బుల్లీ" అన్నాడు.

బుల్లి మొదట కాస్త సంకోచించి తర్వాత ఆయనదగ్గిరికి వెళ్లింది. రాగానే బుల్లిని పట్టుకొని కృష్ణయ్య తన ఒళ్లో కూచోపెట్టుకొని చిలకలు చేతికిచ్చి "బుల్లీ, నన్ను మరిచి పోయినావా?" అని అడిగినాడు.

అందుకు బుల్లి "ఊఁహూఁ" అంటూ ఎడమ చేయి విసరగా అది పోయి తాండవకృష్ణయ్య చెంపమీద తగిలింది. ఆయన ఆచెయ్యి ముద్దుపెట్టుకున్నాడు.

"తప్పగాదూ, పెద్దనాన్నగారిని అట్లా కొట్టవచ్చునా?" అన్నది నాగరత్నమ్మ.

బుల్లి పెద్దనాన్న ఒళ్లోనుంచి లేవవలెనని ప్రయత్నిస్తూ ఉండగానే చంద్రశేఖరం వచ్చినాడు. ఆయనను చూడగానే బుల్లి చివాలున లేచి "ఏమితెచ్చావు?" అంటూ ఎదురుగా పరుగెత్తుకొని వెళ్లింది.

చంద్రశేఖరం తాండవకృష్ణయ్యను చూసిన తొందరలో బుల్లివంక సరిగాచూడక తాండవకృష్ణయ్యతో "ఈ రైలుకే వచ్చారా? నేను ప్లాటుఫారముమీద ఎంత వెదకినా కనపడలేదే!" అన్నాడు.

"నేనూ మీకోసము వెదకినాను. ఆసందడిలో ఒకరి నొకరు చూసేదెట్లా? ఎంత మందో!" అన్నాడు తాండవకృష్ణయ్య.

"మీరు గట్టిగా వస్తానని వ్రాయడంబట్టి స్టేషనుకు వచ్చి మీరు కనబడక పోయేప్పటికి ముసలాయనకు పాప మెట్లా ఉన్నదో అనుకున్నాను. చాలాసేపు ప్లాటుఫారముమీద ఈ చివరనుండి ఆ చివరకు వెదుకుతూ తిరిగి మీరు రాలేదని నిశ్చయంచేసుకొని ట్రామెక్కి వచ్చినాను. మీనాన్నగారి కెట్లా ఉన్నది?" అంటూ చంద్రశేఖరం అక్కడనే కుర్చీలో కూచున్నాడు.

"ఏదో కాస్త అట్లానిలిచిఉన్నది. ఏమున్నది, పిల్లదిగులుతప్ప ఆయనకు మరేదీ లేదు. తల్లీతండ్రీ లేనిపిల్లే, దానిని ఒకయ్యకిచ్చి వెంటనే ముడివేస్తేనేకాని వల్లకాదని పట్టుపట్టినాడు." చంద్రశేఖరం తన

వంకనైనా చూడకపోయినందువల్ల ఇంతలో బుల్లి మొగ మింత చేసుకొని కన్నీళ్లతో పినతల్లి వద్దకు వెళ్లినది. పినతల్లి బుల్లితో "నీ పెళ్లిట, బుల్లీ, ఆమాటలువిను" అన్నది. తికమకతో బుల్లి వాళ్లసంభాషణ విన సాగింది.

"వెదుకుకోకుండా మేనత్తకొడుకు ఉండనే ఉన్నాడాయెను. ఆరేళ్ల పిల్ల పెళ్లి కెందు కింతతొందర!" అన్నాడు చంద్రశేఖరం.

అందుకు తాండవకృష్ణయ్య "ఐతే నేమి? ఆయనపిచ్చి ఆయనది. మేమంతా ఉన్నాము గదా, ఈ పెళ్లి ఇంత తొందరలో ఎందుకంటే ఆయన వింటేగా, ఆయన కళ్లతో చూడవలెనట, ఏమి చేస్తాము పెద్దవాడట్లా తొందర చేస్తుంటే!" అన్నాడు.

తాను మొదట సరిగా ఆదరించనందుకు బుల్లి చిన్నబుచ్చుకున్నది చూచి చంద్రశేఖరం దాన్ని దగ్గిరికితీసి "పుచ్చాయి తాతయ్య జ్ఞాపకమున్నాడూ?" అని అడిగినాడు.

బుల్లి కొంత శాంతించి ఆశ్చర్యంతో తల యెత్తి చూస్తున్నది.

నాగరత్తమ్మ "జ్ఞాపకం లేదమ్మా, నీ కెప్పుడూ పుచ్చకాయలు తెచ్చి కోసిపెట్టేవారే, ఆ తాతగారు, జ్ఞాపకం లేదూ?" అన్నది.

"పుచ్చాయి తాతయ్యా? తెల్లటి పిలకజుట్టు ఉంటుంది, ఆ, తెలుసు" అని బుల్లి పలికింది.

"తాతయ్య నిన్ను తీసుకురమ్మన్నాడు వస్తావా?" అని తాండవకృష్ణయ్య అడిగినాడు.

"ఆఁహాఁ" అన్నది బుల్లి తల ఊపుతూ.

మళ్లీ తాండవకృష్ణయ్య "తాతయ్య నీకు పెళ్లి చేస్తారట చేసుకుంటావా?" అని అడిగినాడు.

వెంటనే బుల్లి అన్నది, "ఆ! నాకు ఒళ్లంతా కనపడకుండా పూలు కప్పుతారా, పల్లకీలో కూవోబెట్టుకొని శంఖాలు ఊదుతూ తాళాలు వాయిస్తూ ఊరేగిస్తారా?"

"శంఖాలు కాదమ్మా. బ్యాండూ సన్నాయీ రమేడోళ్లు వాయిస్తారు. పూలజడ వేసుకొని పల్లకీలో నువ్వొక పక్క – బావొక పక్క కూచుని ఊరేగుతారు. నీకు బావ జ్ఞాపకమున్నాడా?" అని తాండవకృష్ణయ్య అడిగినాడు.

"ఆ! బావకూడానా? బావ మంచివాడేలే. మే మిద్దరమూ పూలతో ఆడుకుంటాము. ఇన్నిపూలుంటవిగా!" అని తన బుల్లి చేతులు ఎడంగాజాపి చూపుతూ బుల్లి పలికింది.

"ఆ" అన్నాడు తాండవకృష్ణయ్య.

అప్పుడు నాగరత్తమ్మ బుల్లిని "మీ పెద్ద నాన్నగారు నిన్ను మీ ఊరు సీపెల్లికి తీసుకొని వెళ్లుతారట, వెళ్లుతావా?" అని అడిగింది.

దానికి బుల్లి "ఆ, ఇక్కడేగా పెళ్లిఅయ్యేది!" అన్నది.

"ఇక్కడ కాదు, మన ఊళ్లో! పుచ్చాయి తాతయ్య ఉంటాడే, ఆ ఊళ్లో!" అని అందుకున్నాడు తాండవకృష్ణయ్య.

బుల్లి "ఊఁ, నీకు తెలియదులే. ఇక్కడే పెళ్లిళ్లు ఔతవి. అక్కడ అంతా పోతారు.

ఇప్పుడెవరు పోయినారు పెద్దనాన్నా?" అని అడిగింది.

"ఛా, అట్లా అనరాదు" అని ముగ్గురూ ఒక్కసారిగా అన్నారు.

బుల్లి జంకక అన్నది, "మీకు తెలియదులే. అక్కడ ధర్మరాజు అందరినీ ఎత్తుకపోతాడుగా! పిన్ని చెప్పింది నాకు తెలుసులే, అప్పా, కాదూ?"

"పిన్నికేం తెలుసు? అది ఎప్పుడూ అట్లాగే అంటుందిలే" అన్నాడు నవ్వుతూ చంద్రశేఖరం.

బుల్లి తల నాజూకుగా నెమ్మదిగా ఇటూ అటూ తిప్పుతూ అడుగులు ఇటూ అటూ వేస్తూ "ఎట్లా ఐనా నే నా ఊరు వెళ్లనులే" అన్నదీ.

"మన ఊరు రావమ్మా? అక్కడ కావలసినన్ని పుచ్చకాయలు తాతయ్య కోసిపెట్టుతాడు; నీకు చాలాచిలకలు కొనిపెట్టుతాను. బావతో చక్కగా ఆడుకుందువుగాని, రావూ?" అని తాండవకృష్ణయ్య అడిగినాడు.

"రాను, అక్కడికి వస్తే మళ్లీ రాకుండా అందరినీ ధర్మరాజు ఎత్తుకు పోతాడు. పుచ్చకాయలూ చిలకలూ అన్నీ ఇక్కడికే తీసుకు రారాదూ? బావా నేను ఇక్కడనే పల్లకీలో ఎక్కి పెళ్లి చేసుకోవచ్చుగా!" అన్నది బుల్లి.

"పిచ్చిదానా," అన్నాడు చంద్రశేఖరం.

"సరే గాని, బుల్లి బాగా అల్లరి చేస్తున్నదా?" అని తాండవకృష్ణయ్య అడిగినాడు.

"నే నల్లరిచేయను. అల్లరి చేస్తే ధర్మరాజు వస్తాడుగా! వాడంటే నాకు భయం" అన్నది బుల్లి.

ఇంకా కొంతసేపు సంభాషణ జరిగినమీదట వాళ్లు స్నాన భోజనాలకు లేచినారు.

"ఇందాక అప్ప నాకేమీ తీసుకు రాలేదు. ఇవ్వాళ చిలకల బాబు దగ్గర అన్నానికి కూచుంటా" అన్నది బుల్లి.

౨

బుల్లికి నాలుగేళ్ళ ఈడున తండ్రి గతించినాడు. ఇప్పటికి సంవత్సరం కిందట తల్లికూడా కాలధర్మము పొందినది. ఆ తర్వాత పినతల్లి నాగరత్నమ్మ తన దగ్గరకు తెచ్చుకొని పెంచుతున్నది.

నాగరత్నమ్మకూ చంద్రశేఖరానికీ పిల్లలు లేరు. భార్యా భర్తా ఎప్పుడూ ఒకటే తీరుగా కాపరం చేస్తూ ఉండడము విసుగుపుట్టి, పిల్లలుకావలెనని ముఖ్యంగా కోరుకునే ఈడు వాళ్ళకు వచ్చినది. కాని అప్పుడే పిల్లలసలు కలగరేమో అనేసందేహము అంకురిస్తున్నది.

ఆసమయంలో బుల్లి సందర్భపడడముచేత వాళ్ళకు కొంత మనశ్శాంతి కలిగినది. అందువల్ల వాళ్లు బుల్లిని మిక్కిలిఆదరంతో చూస్తుకుంటున్నారు.

చంద్రశేఖరం ఉద్యోగముచేస్తూ పై అధికారితో పోట్లాడి వాళ్లే డిస్మిస్ చేయడానికి ప్రయత్నిస్తూ ఉండగా తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, భార్యతో చెన్నపట్టణంవచ్చి

లా కాలేజిలో చేరినాడు. వాళ్లు వచ్చేటప్పుడు బుల్లినికూడా వెంటతీసుకొని వచ్చినారు.

నలుగురిలో పెరిగిన బుల్లికి చెన్నపట్టణంలో ఒంటరిగా ఉండడము మొదట కష్ట మనిపించి నది. ఏదో దిగులుదిగులుగా ఉండేది. ఎప్పు డూ ఏదో ఏడుపే. మాటిమాటికీ తల్లి విష యము ప్రశ్నలు వేసేది. పినతల్లి ఏదో విధంగా ఆ మాటలు మరిపించవలెనని ఏవో మాటలు అల్లి చెప్పుతూ ఆదరంతో పెంచు తున్నది.

ఒకరోజున బుల్లి, తల్లికోసము మరీ మారాము చేసినది. "అమ్మను ఎక్కడికో తీసుకుని పోయి నారు, ఎక్కడికి వెళ్లిందో చెప్పు"మని కూచు న్నది.

"ఊరికి వెళ్లిందమ్మా" అని నాగరత్నమ్మ కన్నీ ళ్లతో అన్నది.

"ఏఊరికి వెళ్లింది? నన్నుకూడా అక్కడికి తీసుకుపోరాదూ?"

"నీవు వెళ్లకూడదు. చిన్నవాళ్లను రానీ యరు."

"నువ్వు తీసుకుపోరాదూ? అమ్మను చూచి ముద్దియ్యాలె నని ఉన్నది. నువ్వు పెద్దదాని వేగా!"

"సరేకాని అమ్మా, మొన్న మ్యూజియముకు వెళ్లినాము జ్ఞాపక మున్నదా? అక్కడ పిట్ట లూ లేళ్లూ పెద్దపుల్లూ పాములూ బీరువా లలో పెట్టి ఉన్నవి చూశావా? ఆ ఈకల పక్షి జ్ఞాపక మున్నదా?"

"కాదు లెద్దూ! ముందు నన్ను అమ్మ దగ్గ రకు తీసుకునిపో!"

"అల్లరిచేయవద్దు, నిన్ను రానీయరు!"

"నన్ను రానీయక పోయె దెవరేం?"

"ధర్మరాజు"

"వాడేనా అమ్మను తీసుకు పోయింది?"

"అవును"

"నాన్నను?"

"వాడే"

"ఇంకా అడోళ్లో మా నూమ్మనూ పనిచేసే సుబ్బిని గడ్డంబాబునూ తీసుకు పోయిందికూ డా వాడేనా?"

"వాడేకాని నీకెలుబుండి ఏది?"

బుల్లి పినతల్లి నోరు గట్టిగా మూసి "అది సరే లెద్దూ, ధర్మరాజు ఎక్కడ ఉంటాడు?" అని అడిగింది.

"ఆ ఊళ్లోనే."

"అయితే అమ్మ నన్నెట్లా విడిచిపెట్టి ఉన్నది? కాస్సేపు ఆడుకోడానికి వెళ్లితేనే ఎక్కడికే అని వెంబడి పడేదే?"

నాగరత్నమ్మ కన్నీళ్లతో అన్నది: "ఏం జే స్తుంది? ధర్మరాజు రానీయడు."

"నన్నుకూడా వాడు తీసుకొని పోడూ?"

"ఊఁహూఁ!"

"నేను వెళ్లగూడదూ?"

"వెళ్లగూడదు. మనని అప్ప ఇవ్వాళ నాట కానికి తీసుకు వెళ్లుతారట! మొన్న మనం చూసిన బొమ్మలు ఎట్లా ఉన్నవి?"

"ముందు ఇదిచెప్పు, నే నెందుకు వెళ్ల కూడదు?"

"నీవు వెళ్లితే ధర్మరాజు కొడతాడు."

"ధర్మరాజు మంచివాడు కాడూ?"

"వాడు బహు చెడ్డవాడు"

"వాడు ఎట్లా ఉంటాడు?"

"నల్లగా ఉంటాడు"

"మాలకాకిలాగా ఉంటాడేం?"

"అవును"

"గడ్డముంటుందా? బూచివాడిలాగా ఉంటాడేం?"

"బూచివాడి కంటే కూడా చెడ్డవాడు. వాడి దగ్గిరికి వెళ్లితే బూచివాడే జడుసుకుంటాడు"

"అయితే, అమ్మ జడుసుకోలా?"

"అమ్మా జడుసుకుంది. ఏంజేస్తుంది?"

"నాన్న వాణ్ణి కట్టలేడూ? మాఊళ్లో గిరల గోచీవాణ్ణి ఒకసారి నాన్న చావ గొట్టినాడుగా!"

"ధర్మరాజు అటువంటివాడు కాడు. మీ నాన్ననుకూడా కొడతాడు."

అయ్యో! నాన్న ఎప్పుడూ నన్ను కొట్టేవాడు కాడే! ధర్మరాజు కొడతాడా?"

"ఆ!"

"అయితే ధర్మరాజు ఈ ఊళ్లోకూడా ఉంటాడా?"

"ఉండడు"

"వాడు మాఊళ్లో నేనా ఉండేది?"

"అవును"

"అయితే నేను మా ఊరు మళ్లీ వెళ్లను. ఇక్కడనే ఉంటానే అప్పా!"

"మీఊరు వెళ్లవద్దు, ఇక్కడనే ఉండు!"

"ఇక్కడికి ధర్మరాజు రాడుగా! వాణ్ణిచూస్తే నాకు భయం వేస్తుంది."

"ధర్మరాజీఊరు ఎప్పుడూ రాడు కాని పిల్లలెవరైనా అల్లరిచేస్తూ ఉంటే భయపెట్టడానికి వస్తాడు."

"నేను అల్లరి చేయనుగా!"

"అయితే వాడూ రాడుగా!"

ఆపైన ఎప్పుడూ అమ్మనూ నాన్ననూ చూపించమని మళ్లీ బుల్లి ఆగంచేసి ఎరగదు. బుల్లికి వాళ్లఊళ్లో ధర్మరాజు ఉన్నాడనీ అందరినీ కొట్టి ఎత్తుకుపోతాడనీ భావ మేర్పడ్డది. ఎవరైనా వాళ్ల ఊరినుంచివస్తే వాళ్లను "ఎవరు పోయినారు?" అని ముందుగాపోయి అడిగేది.

ఎప్పుడన్నా బుల్లి ఆగంచేస్తూఉంటే ధర్మరాజు వస్తున్నాడంటే . ఇక కుక్కిరి మిక్కిరి మనదు. ధర్మరాజు పేరెత్తితే ఆ పసికూన ఒళ్లు వణికేది. ఆ పసిపిల్ల పూవమనస్సులో ధర్మరాజు కఠిన స్వరూపము గాఢంగా నాటిపోయింది.

చెన్నపట్టణం వచ్చినతర్వాత ఎక్కువభాగము ఇంట్లోనే ఉండడమువల్ల ఎప్పుడోకాని బయటికివెళ్లడము తటస్థించేదికాదు. అట్లా వెళ్లినప్పుడెప్పుడూ శవాన్నిచూడడము తటస్థించలేదు. వీటికి పినతల్లిమాటలు తోడై ధర్మరా

జక్కడలేదనీ అక్కడ మనుష్యులు పోరనీ కూడా బుల్లి మనస్సుకు తోచింది.

కాని ఆమధ్య వాళ్లొకసారి మ్యూజియముకు వెళ్లుతున్నరోజున ఒక శవాన్ని పల్లకీలో పెట్టి పూలతో అలంకరించి శంఖులు ఊదుతూ తాళాలు వాయిస్తూ ఆడంబరంగా తీసుకొనిపోతూ ఉండడము బుల్లికి కనపడ్డది. పడుకున్న శవాకారం చూడగానే దాని తల్లిదండ్రుల సంగతి జ్ఞాపకము వచ్చి "ఏమిటది? వాణ్ణి ధర్మరాజు ఎత్తుకు పోతున్నాడా?" అని అడిగింది.

"కాదు. అది పెళ్లిపల్లకీలో ఊరేగిస్తున్నారు" అన్నది పినతల్లి.

"అవునులే. ఇది పెళ్లిళ్ల ఊరుగా! నాకుకూడా ఇక్కడ పెళ్లి చేస్తారా?"

"నీకూ ఔతుంది."

"అప్పుడు నన్నూ ఇట్లాగే పూలుపెట్టి పల్లకీలో ఊరేగిస్తారా?" అని బుల్లి అడిగింది.

ఇంతలోకే ఊరేగింపు దాటిపోయింది. ఇంకో వైపుగా సోల్జర్లు వస్తూఉంటే బుల్లి దృష్టి ఆ వైపుకు మళ్లింది.

అప్పటినుంచీ చెన్నపట్టణం పెళ్లిళ్ల ఊరని బుల్లి మనస్సులో నాటి పోయింది.

ఇటువంటి సందర్భంలో వాళ్ల తాతగారు బుల్లిని పెళ్లినిమిత్తము స్వగ్రామానికి తీసుకురమ్మని పెద్దకుమారుడైన తాండవకృష్ణయ్యను చెన్నపట్టణం పంపినాడు.

3

బుల్లి తాతగారికి చాలా జబ్బుగా ఉన్నది. ఆయన గొంతులో ఊపిరి ఉండగానే బుల్లికి పెళ్లి చేయవలెనని పట్టు పట్టినాడు. వెదుకుకోకుండా వెదుకుకూడా మేనరికము సిద్ధముగా ఉన్నందుచేత వెంటనే పెళ్లి చేయ నిశ్చయించుకున్నారు. వివాహలగ్నము వారము రోజులలో ఉన్నది. కావలసిన సంబంధం కాబట్టి ఏమీ అనుకోకుండా రెండు వైపులవాళ్లూ అడావిడిగా పెళ్లిపనులు చేస్తున్నారు.

తాండవకృష్ణయ్య వచ్చినరోజు రాత్రికే మళ్లీ ప్రయాణము కాదలచి వచ్చినాడు. తొందర తొందరగా బుల్లి పరికిణీలూ చొక్కాలూ నాగిరత్నమ్మ సర్దసాగింది. బుల్లికి దిగులు పుట్టింది.

"ఎందుకే అప్పా ఇవన్నీ సర్దుతున్నావు?" అన్నది.

"రాత్రికి పెద్దనాన్నగారితో ఊరికి వెళ్లుతువుగాని,"

"నేను వెళ్లను"

"నీ కక్కడ పుచ్చకాయలూ పంచదార చిలకలూ పెడతారు"

"నేను వెళ్లనంటే! నాకవన్నీ అక్కరలా!"

"నీకు సిల్కు జాకెట్లూ పరికిణీలూ లేసుచొక్కాలూ ఇన్ని కుట్టిస్తారు"

"నా కవేమీ అక్కరలా! నేను వెళ్లనూ!"

"నీకు చక్కగా తలదువ్వి, శుభాన కల్యాణం బొట్టుదిద్ది బుగ్గను కాటికపెట్టి కాళ్లకు పసుపూ పారాయణా పూసి పెళ్లికూతుర్ని చేస్తారు.

పూట కొకమాదిరిగా పూలజడ వేస్తారు. బావతో చక్కగా పూలచెల్లాడుదువుగాని. సరే కాని బావకు తలంబ్రాలు ఎట్లా పోస్తావు? పోయడం నీకు బాగా చేతనౌనా?"

"నాకు తెలుసులే, అక్కడ ధర్మరాజు నన్ను పట్టుక పోతాడు," అని బుల్లి వణుకుతూ అన్నది.

పినతల్లి బుల్లిని దగ్గిరికి తీసుకొని వీపు చరిచి "లేదమ్మా, ధర్మరాజక్కడ లేడు. నిన్ను భయపెట్టడానికన్నాను గాని నిజంగా అక్కడ ధర్మరాజు లేడమ్మా!" అన్నది.

"కాదులే, నాకు తెలుసు. ఇందాక పెద్దనాన్నను కొట్టినానని నన్ను ధర్మరాజుకు అప్పగించ దలుచుకున్నావు కాదూ? నేనిక పెద్దనాన్నను కొట్టను" అని బుల్లి కన్నీళ్లు విడిచింది.

పినతల్లి కూడా కన్నీళ్లతో కౌగిలించుకొని "లేదమ్మా, ధర్మరాజు నిజంగా అక్కడ లేడు. ఉంటె మాత్రము వాడేం జేయగలడు? పెద్దనాన్న తన్ని పారవేస్తాడు" అన్నది.

"వద్దే అప్పా! నాన్నను ఎత్తుకు పోయినాడుగా. పెద్దనాన్నను చూస్తే ఏం భయం? నాకే పెద్దనాన్నను చూస్తే భయం లేదు."

"అయ్యో, అట్లా అనరాదే. చెప్పుతుంటే విను అమ్మా, అక్కడ ధర్మరాజు లేడు. అమ్మ నిన్ను పిలుచుకు రమ్మన్న దట."

"నేను అల్లరిచెయ్యను అప్పా! నాకు ధర్మరాజంటే భయం. ఆయూరు నన్ను పంపవద్దు. నేను పోను."

"కాదమ్మా, అమ్మ నిన్ను పిలుచుకు రమ్మన్నదట. ఆ ఊళ్లో నుంచి ధర్మరాజు ఇప్పుడు వెళ్లిపోయినాడు. నీ కేం భయం లేదు."

ఎంత చెప్పినా బుల్లి ఏమీ వినలేదు. ప్రయాణానికి సద్దుతున్నకొద్దీ బుల్లి ఏడుపు ఎక్కువవుతున్నది. ఇదేమి కర్మ మని పినతల్లి దిగులుపడసాగింది. ఇంతలో బజారుపను లన్నీ చేసుకొని సాయంత్రమయ్యేప్పటికి చంద్రశేఖరం తాండవకృష్ణయ్యా వచ్చినారు. వాళ్లు కూడా తమ శాయశక్తులా చెప్పి బుల్లిని ఓదార్చ చూచినారు. కాని వాళ్లకు సాధ్యం కాలేదు. ఓభూయిత్యంగా ఉంటేమాత్రము ఏమి చేస్తారు? తాతకు ప్రాణం మీదికి వచ్చి ఉంటే ఆరోజే వెళ్లక తప్పుతుందా?

ఇప్పుడు బుల్లిని తాండవకృష్ణయ్య తీసుకొని వెళ్లితే చంద్రశేఖరం నాగరత్నమ్మా లగ్నం నాటికిరావచ్చునని వాళ్లు మొదట ననుకున్నారు. కాని బుల్లి ఆగంతో దాన్ని ఒంటరిగా తాండవ కృష్ణయ్య తీసుకొని పోవడము సాధ్యముకాలేదు.

"పోనీ, ఇకవారము రోజులేకదా వ్యవధి. ఈ నాలుగురోజులపాటూ ఎట్లాగో చంద్రశేఖరం గారు ఇబ్బంది పడతారు. పిల్ల ఇంత ఆగం చేస్తున్నదామెను! పోనీ నువ్వుకూడా ఇవ్వాళనే బయలుదేరమ్మా! అని నాగరత్నమ్మతో తాండవకృష్ణయ్యా అన్నాడు.

కాని అప్పడామె బయలుదేరితే భర్తకు ఇబ్బంది. ఐనా ఏమీచేసేది లేక చంద్రశేఖరమే ఆమెను పోనీ ప్రయాణం కమ్మన్నాడు. ఆమె అడావిడిగా బట్టలన్నీ సద్దుకొని ఆరోజే

ప్రయాణమైనది. ఆమెకూడా బయలుదేరుతుందని తెలిసిన తర్వాతనైనా, బుల్లి ఆఆగపు ఉద్ధృత్వము చాలించినదే కాని పూర్తిగా ఊరికి వెళ్లడానికి ఉన్ముఖం కాలేదు.

చంద్రశేఖరం వాళ్లను పంపడానికి రైలుస్టేషనుకువచ్చి వెళ్లేటప్పుడు "నేను లగ్గంనాటికి వస్తాను, జాగ్రత్తగా వెళ్లండి!" అని బుల్లిని ముద్దు పెట్టుకొని వెళ్లిపోయినాడు.

౪

వాళ్లు ఊరికి వెళ్లేటప్పటికి ఇంటిచుట్టూ చాలా సందడిగా ఉన్నది. వాకిట్లో జనము వచ్చే వాళ్ళూ పోయేవాళ్లుగా ఉన్నారు.

బుల్లికి తన తండ్రీ తల్లీ చనిపోయినరోజులు జ్ఞాపకము వచ్చినవి. అప్పుడూ ఇట్లాగే జనం రామంధాళిగా తిరిగేవాళ్లు. "మా ఇంట్లో ధర్మరాజు ఎవరిని ఎత్తుకుపోతున్నాడే అప్పా" అని బుల్లి నాగరత్తమ్మను అడిగింది. "ఈ ధర్మరాజు నెక్కడ పట్టుకున్నావే? అట్లా అనరాదమ్మా" అని నాగరత్తమ్మ అన్నది కాని ఆమెకుకూడా భయంగానే ఉన్నది. తాండవకృష్ణయ్య ఆపాదమస్తకమూ కంపిస్తున్నాడు.

ఇంటికి వాళ్లు వెళ్లే టప్పటికి వాళ్లకు కాళ్లకు నీళ్లిచ్చేవాళ్లుకూడా లేకపోయినారు. బుల్లి తాతగారు అవసానదశలోఉన్నారు. ఆ కష్ట సమయంలో ఇంటికి వచ్చిన బంధువును మర్యాద చేయచూచేది ఎవరు?

తాండవకృష్ణయ్య తండ్రివద్దకు వెళ్లినాడు. ఆయనను భూశయనంచేసినారు. కాని ఆయనకింకా స్మృతి తప్పలేదు.

"నాన్నా, బుల్లి వచ్చింది" అని తాండవకృష్ణయ్యనోట మాటలు వెడలేటప్పటికి మరణవేదన పడుతున్న ఆ వృద్ధుని కళ్లు వికసించినవి. అతిప్రయత్నం మీద ఓపిక తెచ్చుకొని "అమ్మా, బుల్లీ" అని మూలుగుతూ పిలిచినాడు.

పక్కను నిలుచున్న ఎవరో పొరిగింటి ముసలమ్మ ఒకతె "మీ పుచ్చాయి తాతయ్య పిలుస్తున్నాడు, పో అమ్మా, బుల్లీ!" అని కళ్లనీళ్లు పెట్టుకున్నది.

బుల్లి నివ్వెరపోయింది. దాని తల్లిదండ్రుల అవసానదశలు జ్ఞాపకమువచ్చినవి. పక్కను మంచ ముండగా వాళ్లనూ ఇట్లాగే కింద పడుకో బెట్టినారు. అంతా ఇట్లాగే మూగి ఉన్నారు. అప్పుడూ కొంతమంది ఇట్లాగే కన్నీళ్లు విడుస్తున్నారు. కొందరి కళ్లూ ముక్కులూ ఎఱ్ఱగాఉన్నవి. అక్కడ తప్పక ధర్మరాజుంటాడని తాతదగ్గిరికి వెళ్ల జంకింది. "పిల్ల మాగాభరలో భయపడుతున్న దట్లా" అన్నారు ఒకరు.

బుల్లిని ఎవరో ఒకరు తాత దగ్గరకు తీసుకొని వెళ్లినారు. అక్కడ దానికి ధర్మరాజు కనపడలేదు. కాబట్టి కొంతభయం తీరింది. తాత బుల్లి చేయిపట్టుకొని "అమ్మా, నీపెళ్లి ఈ కళ్లతోచూసి సంతోషించే ప్రాప్తము లేకపోయినా నిన్నన్నా చూడగలిగినాను. ఊఁ!

నారాయణ!" అన్నాడు. చుట్టు నున్నవాళ్లు కొందరు 'నారాయణ' అన్నారు, మరికొందరు కళ్లనీళ్లు పెట్టుకున్నారు.

కాని ఆవృద్ధుడు ఆరోజున పోలేదు. మరునాడు సాయంత్రందాకా వచ్చే తెలివి పోయే తెలివితో అతని జీవము తన్నుకి లాడినది.

సూర్యుడస్తమించినాడు. అసురసంధ్యారాగము లోకాన ఆవరిస్తున్నది. దీపాలు పెట్టేవేళ ఐనది. అప్పుడు ఆ వృద్ధుని దేహములోని చైతన్య దీప మారిపోయింది.

"అడుగోనే ధర్మరాజు! తాతయ్యను లాక్కుపోతూ నన్నుకూడా రమ్మని చేతితో సంజ్ఞ చేస్తున్నాడే!" అని అప్పుడు బుల్లి కెవ్వున కేక పెట్టింది. ఇతరుల ఏడుపులో అది కలిసిపోయింది. ఆ సందడిలో బుల్లి సంగతి కనుక్కునేవాళ్లెవరు?

ఆరాత్రి పడుకోబోయేప్పుడు బుల్లి ఒళ్లు వెచ్చగా ఉన్నట్లు నాగరత్తమ్మ చూచి కొంచెము భయపడ్డది.

౫

మరునాడు చెక్కుల మంటగా బుల్లికి జ్వరము వేగిపడుతున్నది. ఆ జ్వర మెక్కడి జ్వరమో కాని బుల్లి ముక్కునవచ్చే శ్వాసవేడికే పక్కనున్న వాళ్లకు దగ్గర కూచోడము కష్టసాధ్యమయింది. అందులో పైత్యించినది. ఉలికి ఉలికి పడుతున్నది.

"అమ్మ రమ్మంటున్నదా? రాను—మాలకాకి!—నీ నలుపుచూస్తే నాకు భయము వేస్తున్నది—బావా, ఊరేగుదాంరా!—పూలేవీ? శంఖులేవీ?—తాళాల చప్పుడు చెవులు పగులుస్తున్నది—బూచి వాణ్ణికూడా భయపెడతారా?—బట్టకట్టుకో—పిల్లలను కొడతాడా?—నాన్నను కొటుతున్నాడు—పూలేవీ? ఇన్నిపూలు! పల్లకీ!—ధర్మరాజు మంచివాడుకాడే, ఆఊరు వెళ్లనే అప్పా!—నేను అల్లరిచెయ్యనే! పెద్దనాన్నను కొట్టనుగా! వాడు నన్ను లాక్కుపోతున్నాడే! పెద్ద, నాన్నా, అయ్యో!"

ఈవిధంగా పిచ్చిమాటలూ వెఱ్ఱిమాటలూ; మధ్యమధ్య ఎగిరెగిరి పడుతుంది; కెవ్వుమని కేకవేస్తుంది.

నాగరత్తమ్మకు కాలు నిలవడంలేదు. తండ్రి కర్మ సందడిలో ఉన్నా తాండవకృష్ణయ్య ఏమీ అశ్రద్ధచేయకుండా బుల్లి సంగతి కనుక్కుంటున్నాడు.

పైత్య జ్వరమని రాజవైద్యుడు మందులు విసుగూ విరామంలేకుండా పోస్తున్నాడు.

జడుసుకున్నదని మాంత్రికులు విభూతీ తీర్థమూ ఇస్తున్నారు.

భూతచేష్ట అని భూతవైద్యులు చేయిస్తున్నారు.

ఇందులో సూతకము, ఎట్లా ఉండవలెనో అట్లా ఉన్నది!

తల్లికంటె ఎక్కువగా నాగరత్తమ్మ బుల్లి దగ్గర నిద్రాహారాలు లేకుండా కూచుంటూ ఉన్నది. బలవంతాన తాను బుల్లిని ఇక్కడికి తీసుకొనివచ్చినదని తలపుకు వచ్చినప్పుడు ఆమె హృదయంలో చిచ్చులపిడుగులు ప్రవేశించి కలచివేస్తున్నట్లుగా ఉంటున్నది. భర్త వస్తే ఏమిజవాబు చెప్పగలదు?

చంద్రశేఖరానికి వృద్ధుని మరణవార్త తెలియలేదు. బుల్లి వివాహానికి చక్కని పరికిణీలూ చొక్కాయిలూ, వరుడికి బట్టలూ, కట్నాలు కానికలకు ఇంకా ఎన్నో చక్కని వస్తువులూ కొనుక్కొని లగ్నం నాటికి ఉత్సాహంతో వచ్చినాడు.

ఆయన ఇంటికి వచ్చేటప్పటికి బుల్లిని ధర్మరాజు తీసుకొనిపోయి తల్లిదండ్రులు తాతా ఉన్నచోటికి చేర్చినాడని తెలిసింది.

“తమకు పిల్లలు లేకపోయినా అదే తమపిల్లగా భావించి నాగరత్తమ్మా చంద్రశేఖరంగారు మురుస్తూ ఉంటే ఇట్లా అయింది. పాపము! మరీ ఆచంద్రశేఖరంగారి ఏడుపు చూస్తే గుండె తరుక్కుపోతున్నదమ్మా!” అనుకున్నారు.

అంత్యనేపథ్యము

నిడుమోలు కనకసుందరం గారు బి. ఏ., (ఆనర్సు)

అవనినాడు సంపీడన మంతరింప
సంత్యనేపథ్య మశ్రుల నలముకొనఁగ
ప్రాణము ప్రశాంతియందు నిర్గమన మొందు
నాదినము రాఁగలదటంచు నేఁ దెలియుదు.
వినను నిశీథముల తార లరయుచుండు,
పూర్వమున్లో ప్రభాతంబు పొడుచుచుండు,
వివిధసుఖదుఃఖములనెల్ల వెలికిఁ గ్రక్కి-
జలధి తరగలగతి గడియలును బారలు.
ఇటుల నాతుదిగడియల నెంచినపుడు
లుప్తమగు కాలమానావరోధ మెపుడు.
మరణకాంతిని గాంతును భవదగమ్య
భవ్యలోకంబు, నగణితభాగ్యయుతము—
అధమపీఠంబు వచ్చట నరుదు కాదె!
అధమ జీవితమేనట యరుదు కాదె!

వ్యర్థముగ నేను గాంక్షించు వస్తుచయము
నేగడించినవాని—భోగీ మ్మవేల
ఎంచలే కెవ్వి నే నిరసించినానో
వాని ధ్రువగతి నాయందు వరల నిమ్ము.